క్లుప్తంగా

యోగాతో జ్ఞాపకశక్తి



జ్ఞాపికలతో ఆయిలం సుజాత, అభ్యాసకులు

శ్రీకాళహస్తి: యోగాతో ఆరోగ్యం లభిస్తుందని, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని శ్రీశివసాయి యోగ సెంటర్ మాస్టర్ ఆయిలం సుజాత తెలిపారు. బెంగళూరులోని శివజ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా గత నెల 24, 25, 26 తేదీల్లో యోగోత్సవ కార్యక్రమం-2025 వర్చువల్ పద్ధతితో యోగాసన పోటీలు నిర్వహించారు. ఇందులో సుజాత యోగా వృక్ష అవార్డును గెలుచుకోగా, విద్యార్థులు సాన్విత సూర్యకుమార్, ప్రియదర్శిని యోగా ప్రతిభ అవార్డులను సాధించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగా చేయాలని కోరారు. అవార్డులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో సత్తా



ప్రతిభ చూపిన విద్యార్థులు

శ్రీకాళహస్తి: చెన్నైలో గత నెల 26వ తేదీన అంతర్జాతీయ అబాకస్ పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాళహస్తికి చెందిన లిటిల్‌మాస్టర్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి స్థానంలో 27మంది, రెండవ స్థానంలో నలుగురు, మూడవ స్థానంలో ఒకరు..ఇలా మొత్తం 32 మంది విద్యార్థులు గెలుపొంది ట్రోఫీలు సాధించారు. శుక్రవారం ఫలితాలు విడుదల కాగా.. ఇందులో భాగంగా ఆదివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ ఇన్‌స్టిట్యూట్ నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొని 27మంది చాంపియన్ ఆఫ్ చాంపియన్, నలుగురు చాంపియన్స్, ఒకరు టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ మునికుమార్, చీఫ్ ట్రైనర్ దివ్య, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు అకౌంటెంట్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


రక్షణ గోడలు నిర్మించండి



ప్రమాదకరంగా కల్వర్టు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని విజయగోపాలపురం గ్రామం వద్ద కేటీ రోడ్డు మార్గంలో అడవి నుంచి నీటి వచ్చే కాలువ కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టుకు ఇరువైపులా గోడలు లేకపోవడంతో వాహనచోదకులు వేగంగా వచ్చినప్పుడు అదుపుతప్పి కల్వర్టులో పడిపోతున్నారు. కల్వర్టు గోడలు దెబ్బతిని 10 ఏళ్లు అవుతున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం మానేశారు. కల్వర్టు గోడలను నిర్మించాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేడుకగా హోమం



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు, పండితులు

తిరుపతి కల్చరల్: పరిహార సేవా ఫౌండేషన్ టీటీడీ సౌజన్యంతో ఆదివారం ఇందిరా మైదానంలో ధన్వంతరి- శ్రీమహాలక్ష్మీ హోమం అత్యంత వేడుకగా నిర్వహించారు. వేదికపై ధన్వంతరి, శ్రీమహాలక్ష్మి ప్రతిమలను కొలువు తీర్చి పూజలు, హోమ క్రతువులు చేపట్టారు. అనంతరం శాస్త్రోక్తంగా హోమం చేశారు. ద్వారకా బధిర ఆశ్రమం శంకరాచార్యుల పరంపరకు చెందిన విద్యానారాయణ తీర్థస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ధన్వంతరి హోమ పూజలతో పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయన్నారు. అనంతరం పూర్ణాహుతితో హోమం పూర్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, డీసీసీబీ మాజీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీఎల్.వర్మ, పరిహార సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.చక్రవర్తి, పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో ఖాళీలు..

అస్తవ్యస్తంగా సరఫరా!

గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా పర్యవేక్షణ కరువైంది. కారణం ట్రాన్స్‌కోలో సిబ్బంది కొరత.. భర్తీకి నోచుకోని కొత్త ఉద్యోగ నియామకాలు.. ఖాళీలు.. వెరసి కర్షకులు, పల్లెవాసులకు కరెంటు కష్టాలు వేధిస్తున్నాయి. మరోవైపు ఉన్న ఉద్యోగులపై పని ఒత్తిడి.. ఫలితం అటు అన్నదాతలు.. ఇటు ట్రాన్స్‌కో ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. విద్యుత్ తీగలకేం తెలుసు ఉద్యోగులు లేరని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- అన్నదాతలకు తప్పని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు
- విద్యుత్‌శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత
- వరదయ్యపాళెం మండలంలో రెండేళ్లుగా భర్తీ కాని 8 ఏఎల్‌ఎంలు
- మరో 6 సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు ఖాళీ
- అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా
- సమస్యలపై సకాలంలో స్పందించలేని స్థితిలో విద్యుత్‌శాఖ



వరదయ్యపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్

వరదయ్యపాళెం: మండల విద్యుత్‌శాఖలో భారీగా ఖాళీలు ఉండడంతో కరెంటు సరఫరా అస్తవ్యస్తంగా మారుతోంది. నిత్యం కరెంటు సమస్యలతో స్థానికులు సతమతమవుతున్నా స్పందించాల్సిన అధికారులు లేకపోవడంతో ఆ శాఖ పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా మండల పరిధిలో చిన్న పాండూరు, సంతవేలూరు, చెదులుపాకం, వరదయ్యపాళెం ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు ఉండగా, వీటి పరిధిలో 14 వేలకు పైగా గృహ వినియోగదారులు, 2153 మంది వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరందరి పర్యవేక్షణ కోసం క్షేత్రస్థాయిలో 16 మంది అసిస్టెంటు లైన్‌మెన్(ఏఎల్‌ఎం)లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 8 ఏఎల్‌ఎం పోస్టులు రెండేళ్లకు పైగా ఖాళీగా ఉన్నాయి. సంతవేలూరు, సీఎల్‌ఎన్‌పల్లి, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో ఇద్దరు, కదూరు, చిలమత్తూరు, కంచరపాళెం, తొండంబట్టు ప్రాంతాలకు ఏఎల్‌ఎం పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో అత్యవసరంగా విద్యుత్ సరఫరాకు సంబంధించి ఏ ఇబ్బంది వచ్చినా స్పందించే దిక్కు లేదు. క్షేత్రస్థాయిలో మండల విద్యుత్‌శాఖ ఏఈ చొరవతో ప్రైవేటు సిబ్బంది ద్వారా అత్యవసర సమస్యలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అటు సమస్యలపై సకాలంలో స్పందించలేక ఇటు వినియోగదారుల సమస్యల తాకిడికి తట్టుకోలేక మండల విద్యుత్‌శాఖ అధికారి ఒత్తిడికి గురవుతున్నారు.

సంతవేలూరు పరిధిలో ఒకరూ లేరు..

సంతవేలూరు సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 10 గ్రామాలకు పైగా ఈ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా కావాల్సి ఉంది. ఇక్కడ ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఏఎల్‌ఎంలు ఉండాల్సి ఉండగా ఒక్క అధికారి కూడా లేరు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో వరదయ్యపాళెం సబ్‌స్టేషన్ నుంచి అక్కడకు వెళ్లి ఇబ్బందికర పరిస్థితులను అధిగమించాల్సి ఉంది. ఇక్కడ తరచూ లోఓల్టేజీ సమస్య, ఇతర సమస్యలు అత్యధికం. వ్యవసాయ సీజన్‌లో ఎక్కువగా మోటర్ల ద్వారా సాగునీరు తోడుకునే పరిస్థితి రైతులది. అయితే అక్కడ లైన్ ఇబ్బందులు, లోఓల్టేజీ సమస్యలు తలెత్తిన సమయంలో సకాలంలో విద్యుత్‌శాఖ స్పందించలేక పోతోంది. దీంతో రైతులు కూడా సకాలంలో విద్యుత్ సమస్యల కారణంగా సాగునీటి ఇబ్బందులను తరచూ ఎదుర్కొంటున్నారు. ఈ సబ్‌స్టేషన్‌ను కూడా రెండేళ్లుగా సిబ్బంది కొరత సమస్య వేధిస్తోంది. ఈ విషయమై స్థానిక రైతులు గతంలో నిరసనలు తెలిపినప్పటికీ పోస్టులు మాత్రం భర్తీకాలేదు.

ఎనర్జీ అసిస్టెంట్లు కూడా ఖాళీనే !

మండల పరిధిలో 6 ఎనర్జీ అసిస్టెంట్ల పోస్టులు గత కొంతకాలంగా ఖాళీగా ఉన్నాయి. గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహించే వీరు మండలంలోని పెద్దపాండూరు, సంతవేలూరు, సీఎల్‌ఎన్ పల్లి, వరదయ్యపాళెం, మత్తేరిమిట్ట, మరదవాడ గ్రామ సచివాలయాల్లో ప్రారంభం నుంచే ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులు భర్తీ కాలేదు. కనీసం ఈ పోస్టులైనా భర్తీ అయితే సకాలంలో విద్యుత్ సమస్యలపై దృష్టి సారించేందుకు వీలు అవుతుందని విద్యుత్ అధికారులు చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..



వరదయ్యపాళెం మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా మండలంలో చోటు చేసుకునే విద్యుత్ సమస్యలపై సకాలంలో స్పందించలేక పోతున్నాం. అన్ని విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తెలియపరిచాం.

–విజయ్ వెంకటేష్, ఏఈ, వరదయ్యపాళెం

లైసెన్సు తప్పనిసరి



వాహనాదారుల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: వాహనాలను నడిపే వారికి తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. ఆయన ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలోని చెక్ పోస్టు వద్ద వాహనాల రికార్డు, వాహనదారుల లైసెన్సు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రికార్డులు సక్రమంగా లేని వాహనాలు ఎక్కువగా ఉండడంతో వాటిని గుర్తించడానికి ప్రత్యేక తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. రికార్డులు లేని వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. ఇసుక ట్రాక్టర్ల యాజమానులు ట్రాలీలోని ఇసుకపై కూర్చోబెట్టి కూలీలను తరలిస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనాలపై ట్రిబుల్ రైడింగ్ చేయడం నేరమన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే జైలు తప్పదని తెలిపారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని, లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తీరని అన్యాయం



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

శ్రీకాళహస్తి: కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు తీరని ద్రోహం చేసిందని వామపక్ష నాయకులు జనమాల గురవయ్య, అంగేరి పుల్లయ్య అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి సంపన్నులకు రాయితీలు పెంచిందని విమర్శించారు. ఈ బడ్జెట్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించి వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలని బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐ అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రంగాలకు మహిళల సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు గోపి, శివకుమార్, గంధం మణి, గురవయ్య, జనార్ధన్, వెలివేంద్రం, రామచంద్ర, చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు.. నిరంతర విద్యార్థులు



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ డా.సుధాకర్ రెడ్డి

రేణిగుంట: ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉంటూ అనేక విషయాలను తెలుసుకుని విద్యార్థులకు బోధించాలని సైకాలజిస్ట్ డా.ఎన్‌బీ సుధాకర్ రెడ్డి సూచించారు. రేణిగుంటలో ఆదివారం జేసీఐ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో మురుగువాడల్లో పని చేసే ఎస్‌బిఆర్‌ఎస్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఉన్న పరిజ్ఞానానికే పరిమితం కాకుండా ఎప్పటికప్పుడు జ్ఞాన సమీకరణ చేసుకోవాలని చెప్పారు. జ్ఞానం, వికాసం, సహానుభూతి, భావ వ్యక్తీకరణ నైపుణ్యం, ఓర్పు, సహనం, చైతన్యం, చురుకుదనం పెంచుకోవాలన్నారు. బోధన, పరిశోధన, కౌన్సెలింగ్, మార్గదర్శనం చేయడంలో మెలకువలు పాటించాలని తెలిపారు. పిల్లలకు ప్రాథమిక సూత్రాలు నేర్పడం కీలకమన్నారు. చదువులో తలెత్తే శారీరక, మానసిక అవరోధాలను గుర్తించి పరిష్కరించాలని అన్నారు. జేసీఐ తిరుపతి శాఖ అధ్యక్షుడు ఆర్.శేషసాయి, ఉపాధ్యక్షుడు రత్నశేఖర్, ఎస్‌బిఆర్‌ఎస్ అధ్యక్షుడు హేమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూణ్ణాళ్ల వెలుగులేనా..!



మర్రిగుంట సమీపంలోని కూడలిలో వెలగని లైట్లు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): నిత్యం ప్రమాదాలు జరుగుతున్న నూతన కూడలిలో అధికారులు ఏర్పాటు చేసిన వీధిదీపాలు కొన్ని రోజులకే వెలగకపోవడంతో మూణ్ణాళ్ల ముచ్చటగా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పూతలపట్టు–నాయుడుపేట నూతన జాతీయ రహదారిలో రేణిగుంట మండలం మర్రిగుంట సమీపంలో నూతన కూడలి వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది కొన్ని రోజుల కిందట సర్కిల్‌లో లైట్లు ఏర్పాటు చేశారు. వాటిలో సగానికి పైగా గత వారం రోజులుగా వెలగకపోవడంతో చిమ్మచీకటి అలుముకుని ఉంది. సమీప గ్రామ ప్రజలు సర్కిల్ దాటాలంటే చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. మరొక ప్రమాదం జరగకముందే హైవే అధికారులు స్పందించి లైట్లు వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.



మర్రిగుంట సమీపంలోని కూడలి

హర్యానా గవర్నర్‌కు సాదర స్వాగతం



అభివాదం చేస్తున్న బండారు దత్తాత్రేయ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం ఉదయం హైదరాబాదు నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, నాయకులు అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన నెల్లూరుకు పయనమయ్యారు.

కల్లూరు మల్లికార్జునకు సత్కారం



కల్లూరు మల్లికార్జున్‌ను సత్కరిస్తున్న దేవాంఘ సంఘం నాయకులు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలోని గోవర్ధనపురానికి చెందిన కల్లూరు మల్లికార్జున్ ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవాసంఘం రాష్ట్ర యూత్ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఆ మేరకు ఆ సంఘం నాయకులు ఆయనను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వరదయ్యపాళెంలోని రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, మరికొందరు దేవాంగ సంఘం నాయకులు మల్లికార్జున్‌ను కలసి శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ గుత్తి త్యాగరాజు, డివిజినల్ ఇన్‌చార్జ్ పీవీ రమేష్, కాట్నా భాస్కర్ బాబు, ఈశ్వరయ్య, రవి, జేషుబాబు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను ఇస్తున్న అర్చకుడు

నాగలాపురం: మండలంలో ప్రసిద్ధిగాంచిన సురుటుపల్లి శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు దంపతులకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఈ ఆలయంలో ఏటా జరిగే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ జయచంద్ర నాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి పల్లకి సేవతో ప్రారంభం కావడం విశేషం. అర్చకులు ఆదివారం పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరిలోని మాజీ ఎమ్మెల్సీ స్వగృహానికి చేరుకుని వారిని ఆశీర్వదించి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): తిరుపతిలో 23, 24 రెండు రోజుల పాటు జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. రేణిగుంటలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వైఎస్ మణి సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మహాసభలో భవన నిర్మాణ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలు రానున్న కాలంలో చేపట్టవలసిన కార్యక్రమాలపై రూపకల్పన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కార్తీక్, సీపీఐ సీనియర్ నాయకులు మురళి, ఏఐవైఎఫ్ మండల నాయకులు భాను, బిల్డింగ్ వర్క్ నాయకులు సెల్వం, రాజేష్, మోహన్, అమ్ములు, హరి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సూర్యనారాయణుడు

తిరుపతి రూరల్: తిరుచానూరు పద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన సూర్యనారాయణస్వామి ఆదివారం తిరుచ్చిపై కొలువై నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం హస్త నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు.

'కథలు ఆలోచింపజేస్తాయి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: కథలు పలువురిని ఆలోచింపజేస్తాయని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ ఆచార్య జంపాల వెంకటరమణ, హాస్యానంద మాసపత్రిక సంపాదకుడు రాము తెలిపారు. బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్‌కామర్స్ కార్యాలయంలో ఆదివారం జేసీఐ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రచించిన 'మీది తెనాలి- మాది తెనాలి' కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ కొసమెరుపు కామెడీ కథలు పాఠకులను ఆకర్షిస్తాయన్నారు. ఆచార్య మూలె విజయలక్ష్మి మాట్లాడుతూ రాజు కథల్లో గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనబడతాయన్నారు. ఈ పుస్తకాన్ని కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమీక్షించారు. రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ కథలు చదువుతూ తాను ఇప్పటి వరకు 17 కథల పుస్తకాలు రాసినట్టు తెలిపారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు జేసీఆర్.శేషసాయి, కార్యదర్శి వి.దిలీప్ కుమార్, కోశాధికారి ఎస్.దిలీప్‌కుమార్, ఆచార్య స్వరాజ్యలక్ష్మి, రచయితలు డాక్టర్ మౌని, అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశ్వ గురువుగా భారత్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.కుప్పరం

తిరుపతి సిటీ: రాజకీయాలకు అతీతంగా యువత, నిపుణులు కృషి చేస్తే భారతదేశం విశ్వగురువుగా అవతరిస్తుందని కెన్యాకు చెందిన మసిండే ములిరో శాస్త్రసాంకేతిక వర్సిటీ ప్రొఫెసర్ జి.కుప్పురం తెలిపారు. ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియం వేదికగా పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్తంగా 'ఇండియా యాజ్ ఎన్ ఎమర్జింగ్ గ్లోబల్ పవర్- ది జర్నీ టువార్డ్స్ వికసిత్ భారత్' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారత్‌లో మేధోశక్తిగల యువత, విద్యావేత్తలు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. వారి కృషితో ప్రపంచంలోనే అత్యధిక వనరులు గల భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా వెలుగొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీవీ మురళీధర్, మహిళా వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డీఎం మమత, ఫ్రాన్స్‌కు చెందిన ప్రొఫెసర్ గుల్లాబ్ మీర్ రెహ్మాన్, శ్యామ్యూల్, అధ్యాపకులు సీఎల్ చెన్నారెడ్డి, డాక్టర్ ఐఎస్ కిషోర్, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ వెంకటేశులు రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు స్వాగతం



లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): నెల్లూరులోని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఇంట జరిగిన రిసెప్షన్‌లో పాల్గొనేందుకు మంత్రి నారా లోకేష్ ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు సాదర స్వాగతం పలికారు. అలాగే మధ్యాహ్నం పర్యటన ముగించుకుని విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు అధికార యంత్రాంగం, పార్టీ నాయకులు సాదరంగా వీడ్కోలు పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్ నాయుడు, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, బొజ్జల సుధీర్ రెడ్డి, మురళీ మోహన్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్, రేణిగుంట తహసీల్దార్ సురేష్ బాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- శివరాత్రి ఏర్పాట్లపై పల్లికొండేశ్వర స్వామి ఆలయ ఈఓ సమీక్ష
- ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు
- తాగునీరు, వసతి సదుపాయాల కల్పన



ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రదోష క్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి వేడుకల్లో స్వామివారి దర్శన విషయంలో సామాన్య భక్తులకే మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఆలయ కార్యనిర్వహణ అధికారి లత తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల గురించి మీడియా సమావేశంలో వివరించారు. ఆలయంలో ఫిబ్రవరి 18 నుంచి 28 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయన్నారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. అయితే ఈసారి ఆలయంలో అంతరాలయ దర్శనాలకు మాత్రం అనుమతి లేదన్నారు. అదే సమయంలో సామాన్య భక్తులు దర్శించుకోడానికి సర్వదర్శనానికి సంబంధించి రెండు అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేసి, వాటితో పాటు రూ.50, రూ.100 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు ఉంటాయన్నారు. అలాగే ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు మాత్రమే వీఐపీలకు దర్శన అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా క్యూలైన్‌లో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. 26వ తేదీ శివరాత్రిని పురస్కరించుకుని పక్క రాష్ట్రమైన తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడం వల్ల భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా తాగునీరు, మజ్జిగ, అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు సజావుగా స్వామివారిని దర్శించుకునేలా..నిత్యం క్యూలైన్లను పర్యవేక్షించడానికి పోలీసులతో పాటు, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సహకారంతో 40 మంది సెక్యూరిటీలను, 30 మంది స్వచ్ఛంద వలంటీర్లను నియమించామన్నారు. భద్రతాపరంగా ఎలాంటి రాజీ లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. మహాశివరాత్రి మహోత్సవాలు విజయవంతానికి అందరూ సహకరించాలని ఆలయ ఈఓ లత కోరారు. ముఖ్యంగా స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించి 11 రోజుల పాటు కొనసాగుతున్న శివరాత్రి వేడుకలను జయప్రదం చేయాలని ఈఓ లత విజ్ఞప్తి చేశారు.